# సజావుగా పోలింగ్

## తాండూరులో 71 శాతం, వికారాబాద్‌లో 68.1శాతం



తాండూరు రూరల్: ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



తాండూరు: నెంబర్-1 ఉన్నత పాఠశాలలో క్యూలో ఉన్న ఓటర్లు

తాండూరు, నవంబర్ 30: తాండూరు నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాం తంగా ముగిసింది. ఉదయం 7 నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత వాతావరణం లో జరిగింది. తాండూరు అసెంబ్లీలోని 269 పోలింగ్ కేం ద్రాల్లో సాయంత్రం వరకు 71 శాతం పోలింగ్ నమోదై నట్లు తాండూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు సంబంధిత శాఖ అధికారులు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు సౌకర్యాలన్నీ కల్పించారు. దీంతో ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. చదురుముదురు గొడవలను మినహాయిస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఉద్యోగులు, ఇతర పనుల నిమిత్తం సొంత ఊరును వదిలి ఇతర పట్టణాల్లో, గ్రా మాల్లో జీవిస్తున్న ప్రజలు ఓటు వేసేందుకు ఊరిబాట పట్టడంతో రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లు జన సంద్రంగా కనిపించాయి.

### ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



తాండూరు: ఓటు వేసిన మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, బీఆర్‌ఎస్ నేతలు

తాండూరు నియోజకవర్గంలో రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతారెడ్డి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. బషీరాబాద్ మండలం ఇందర్‌చేడ్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, భార్య ఆర్తిరెడ్డితో పాటు తల్లిదండ్రులు, సోదరుడు ఓటు వేశారు. తాండూరు పట్టణంలోని ఉర్దూమీడియం పాఠశాలలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ ఓటు వేయగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ తాండూరు మండలం చెన్‌గేశ్‌పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న విజయ విద్యాలయ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకోగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపనర్సిములు సాయిపూర్ ప్రభుత్వ నంబర్-1 పాఠశాలలో ఓటు వేశారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు తమ మండల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించిన అధికారులు, ప్రజలకు ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

**తాండూరు రూరల్:** కోటబాసుపల్లి గ్రామంలో 5 గంటల తర్వాత కూడా ఓట్లు వేసేందుకు సుమారు 200 మంది క్యూలో నిలబడ్డారు. క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర గంట పాటు ఓటింగ్ నిలిచిపోగా, ఓటు వేసేందుకు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. కరణ్‌కోటలో ఎంపీటీసీకి చెందిన రూ.7లక్షల 48 వేలు పోలీసు తనిఖీల్లో నగదు పట్టుబడింది. పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.




పెద్దేముల్ : మండల కేంద్రంలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు



మోమిన్‌పేట: టేకులపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న యువకులు

**పెద్దేముల్:** మండల పరిధిలోని గిర్మాపూర్‌లో ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ మిషన్‌ను ఎడమ కుడి వరుసగా, కుడి ఎడమ వరుసగా అమర్చడంతో అక్కడ గందరగోళం నెలకొంది.అదే విధం గా బుద్దారం గ్రామంలో ఎన్నికల సిబ్బంది ఓ పార్టీకి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు రావడంతో అక్కడ పీవోను మార్చారు. తాండూరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలింగ్ సరళిని ఎన్నికల సిబ్బందికి అడిగి తెలుసుకొన్నారు. మొత్తానికి సాయంత్రం 5 గంటలు పోలింగ్ సమయానికి మండలంలో 72% ఎన్నికల పోలింగ్ పూర్తి అయింది.



పెద్దేముల్ మండల కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రంలో..

### వికారాబాద్ నియోజకవర్గంలో...

వికారాబాద్, నవంబర్ 30 : నియోజకవర్గంలోని 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ ఉదయం తక్కువ శాతం నమోదు కాగా, సాయంత్రానికి ఓటింగ్ శాతం పెరిగింది. వికారాబాద్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 68.1శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్, ఆయన సతీమణి సబిత పట్టణంలోని జడ్పీహెచ్‌పీ బాలుర పాఠశా లలోని 158లో ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును సద్వి నియోగం చేసుకోవాలన్నారు పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తమ ఓటును వినియోగిం చుకు న్నారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కౌన్సిలర్ లంక పుష్పలతారెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల అధికా రులు ఈవీఎం, వీవీ ప్యాడ్లకు సీల్ వేశారు. అక్కడి నుండి పోలీస్ భద్రత మధ్య బస్సులో మెరియేనాట్ పాఠశాలకు చేరుకుని, ఎన్నికల సామాగ్రిని అప్పగించారు.



తాండూరు రూరల్: ఓగిపూర్‌లో...

**నవాబుపేట:** మండలంలో సాయంత్రం 5 గంటల వరకు 63.9 శాతం పోలింగ్ నమో దు అయినట్లు మండల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్య తన సొంత గ్రామం చించల్‌పేటలో కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మోమిన్‌పేట:** మోమిన్ పేట్ మండలంలోని 48 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాతంగా ముగిసింది.76 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మర్పల్లి:** మండలంలో 44వేల 587 మంది ఓటర్లు ఉండగా 33 వేల 638 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళలు 16 వేల 318 మంది, పురుషులు 17 వేల 319 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారని అధికారులు తెలిపారు.. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ మర్పల్లి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు.



తాండూరు: కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప



తాండూరులో ఓటేసేందుకు వచ్చిన వృద్ధులు



తాండూరు: ఓటేసినామంటున్న మహిళలు



పెద్దేముల్ మండంలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులు

## పోలింగ్ కేంద్రంలో పీవో అత్యుత్సాహం..

పెద్దేముల్, నవంబర్ 30 : మండల పరిధిలోని బుద్దారం గ్రామంలో ఎన్నికల పోలింగ్‌లో గురువారం గందరగోళంగా నెలకొంది. గురువారం ఉదయం బుద్దారం గ్రామంలో ఎన్నికల పోలింగ్ ప్రారంభం అయింది.ఆ క్రమంలో వృద్ధులు,కంటి చూపు మందగించినవారు, ఈవీఎం గురించి అవగాహన లేని వారు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు.ఈ క్రమంలో ఈవీఎం మిషన్ ఉపయోగించడానికి తెలియని వృద్ధులు, కంటి చూపు మందగించిన ఓటర్లు ఓటు వేసే క్రమంలో అక్కడే పీవోగా విధులు నిర్వహిస్తున్న జరీనా తమకు కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటు వేయాలని, చేయి చూయించి చెపుతుందని, అలా సుమారు 4,5 మంది ఓటర్లకు అదే విధంగా చెబుతుందని ఓటర్లు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులకు తెలిపారు. విషయం తెలుసుకున్న నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని సుమారు గంటపాటు పోలింగ్‌ను నిలిపి వేయించారు. పీవోగా విధులు నిర్వహిస్తున్న జరీనా అలా ఓ పార్టీకి ఓటు వేయమని చెప్పడం ఏమిటి అని మండిపడ్డారు.తదుపరి అక్కడ జరిగిన విషయాన్ని ఎన్నికల సిబ్బంది స్థానిక సెక్టోరియల్ ఆఫీసర్ సిద్ధార్థ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన మరో పీవో సువర్ణను తాండూరు నుంచి బుద్దారానికి తీసుకొచ్చి ఆమె స్థానంలో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు.అప్పుడు తిరిగి పోలింగ్ మొదలైంది.